## తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి గ్రామీణ, జూన్ 3, ప్రభాతవార్త: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సోమవారం ఉదయం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వేంకటేశ్వర స్వామి కరుణా కటాక్షాలతో ప్రజలందరిపై ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.


# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త


## జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎస్పీ విస్తృత పర్యటన

- నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సిబ్బందికి ఎస్పీ ఆదేశం



# నాలుగంచెల పటిష్ట భద్రత

- సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ



కడప క్రైం, జూన్ 3, ప్రభాతవార్త: ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో బందోబస్తు విధులు నిర్వర్తించే పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ స్థానిక మౌంట్‌ఫోర్ట్ స్కూల్‌లో దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్ద నాలుగంచెల పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. బందోబస్తు విధుల్లో ఉన్న జిల్లా పోలీసులతో పాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, ఏపీఎస్పీ బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పోలీసు అధికారులు సిబ్బందితో ఏర్పాటు చేసిన క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్‌టీ)లు సిద్ధంగా ఉంటాయని, ఎలాంటి ఘటన గురించి సమాచారం వచ్చినా వెంటనే క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారని ఎస్పీ తెలిపారు. సమావేశం అనంతరం కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే రహదారిపై అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే రహదారిపై అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లను అనుమతించేదారులను ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీఎస్ఎస్వీ కృష్ణారావు, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, ఏఆర్‌డీఎస్పీ మురళీధర్, రిమ్స్ సీఐ రామచంద్ర, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు



రాయచోటి గ్రామీణ, జూన్ 3, ప్రభాతవార్త: రానున్న రోజుల్లో చంద్రబాబు సీఎంగా రాయచోటి, రాష్ట్ర ప్రజానీకం సర్వతోముఖాభివృద్ధి చెందాలని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం దక్షిణ కాశీగా పేరుపొందిన భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా తెదేపా అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసి స్వర్ణాంధ్ర సృష్టికర్త చంద్రబాబునాయుడు సీఎం కావాలని వీరభద్రస్వామిని కోరుకున్నామన్నారు. అలాగే పట్టణంలోని పాత రాయచోటిలో గల హజరత్ జమాలుల్లా బాషా సాహెబ్ దర్గాలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు కూడా చేశారు. తన కోసం వెంట నడిచిన ప్రతి కార్యకర్త, అభిమానులకు, శ్రేయోభిలాషులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## మదనపల్లెలో కిలో టమోటా రూ.50 ఆనందోత్సవాల్లో కరువు రైతులు



మదనపల్లె, జూన్ 3 ప్రభాతవార్త:
టమోటా ధరలు గత వారం రోజులుగా గణనీయంగా పెరుగుతున్నాయి. సోమవారం మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె టమోటా మార్కెట్‌యార్డులో మొదటి రకం కిలో టమోటా రూ.50లు ధర పలికింది. మార్కెట్‌యార్డుకు 623మెట్రిక్ టన్నులు టమోటాలు వచ్చాయి. మొదటిరకం పదికేజీల టమోటాబాక్స్ రూ.460నుంచి 500ల వరకు ధరలు పలికాయి. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ ఉండడం వల్లే ధరలు పెరిగాయలని వ్యాపారస్తులు చెబుతున్నారు. టమోటా ఉత్పత్తి కూడా తక్కువగా ఉండడం వల్లే ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయన్నారు. ఇన్నాళ్ళు ధరలు లేక నష్టాలు చవిచూసిన రైతాంగానికి ధరలు పెరగడంతో రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. ఇవే ధరలు నెల రోజులు పాటు ఉంటే రైతులు అప్పుల బాద నుంచి గట్టు ఎక్కగలరని చెబుతున్నారు. రాష్ట్రంలోనే మదనపల్లె టమోటా మార్కెట్‌యార్డు వ్యాపార లావాదేవీలకు పేరు పొందింది. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిస్సా, కర్నాటక, తెలంగాణ, మద్యప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ప్రధాన నగరాలకు ఎగుమతి చేస్తారు. టమోటా వ్యపార లావాదేవీలతో మార్కెట్‌లో వేలాదిమంది కూలీలు జీవనం పొందుతున్నారు.

## నేడే విడుదల...

# ఓటర్ @ గేమ్ చేంజర్

### కడప ఫలితాలపై సర్వత్రా ఆసక్తి రాజంపేట సెంటిమెంట్ కొనసాగుతుందా ?

రాజంపేట అర్బన్, జూన్3 ప్రభాతవార్త
ప్రజా తీర్పు సినిమా నేడు విడుదల కానుంది. ఏడు గంటల నుంచి సినిమా ప్రారంభమవుతుంది. విజేతలు ఎవరో, పరాజితులు ఎవరో జనం తేల్చుతారు. అందుకే ఓటర్ గేమ్ చేంజర్. ఎన్ని సర్వేలు వచ్చినా.. ఎంతమంది.. ఫలితాలపై విశ్లేషణ చెప్పినా... తుది తీర్పు ఓటరు మహారాజుదే. ప్రజల చేతిలో పాశుపతాస్త్రం ఓటు.. కాదంటే ఈ దఫా ఓటుకు ఓట్ల వర్షం కురిసింది. అయితే ఓటరు ఎవరికి జై కొట్టారు.. ఎవరికి ఛీ కొట్టారు.. నేడు తేలిపోతుంది రాష్ట్ర రాజకీయాలలో రాజకీయాలలో కడప ఓ సంచలనం. వైయస్ అయినా, జగన్ అయినా, షర్మిల అయినా రాష్ట్రమంతా చూసేది కడప వైపే. అందుకే కడప గడపలో ఎవరిది ఆదిపత్యం. కడప ఫలితాలు, ప్రధాన రాజకీయ పార్టీలకు వచ్చే సీట్లు కూడా రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తాయనడంలో సందేహం లేదు. ఎందుకంటే ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఇక్కడి నుంచే బీజం పడుతుంది. అధికార పార్టీ అధినేత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కడప ప్రజలు జై కొట్టారా సరి లేదంటే వ్యతిరేకత ఇక్కడ నుంచే బయట పడుతుంది అనడంలో సందేహం లేదు. అందుకు ప్రధాన కారణం ఇక్కడ వైయస్ జమానా 2009 అప్రతిహతంగా కొనసాగింది. 2014లో



జగన్కు అధికారం దక్కకపోయినా మినహా అన్ని నియోజకవర్గాలలో వైసిపి విజయ మోగించింది. 2019లో జగన్ సునామీ విజయాన్ని సాధించారు. అది అప్పటి పరిస్థితి. ఈ ఎన్నికల్లో మాత్రం జగన్ జమానాలో వ్యతిరేకత ఉన్నట్లు ప్రచారం జరిగింది. సర్వేలలో కూడా ఇదే విషయం స్పష్టమైంది. తెలుగుదేశం పార్టీతో పాటు పార్టీ జనసేన ,బిజెపి పార్టీలు కూడా ఇక్కడ ఖాతా తీరుస్తాయనే వరకు సర్వేలు నిర్ణయాన్ని ప్రకటించాయి. ఇవన్నీ నాణెముకు ఒక వైపు మాత్రమే. ఎందుకంటారా జనానికి జగన్ను మరలా సీఎం చేయకుండా పోతే ఎలా? మనమే వ్యతిరేకిస్తే ఎవరు ఆయనకు మద్దతిస్తారు? అన్న అభిప్రాయం ఓటర్ల లో వచ్చి ఉంటే మాత్రం జగన్ కు తిరుగులేదనే చెప్పవచ్చు. అలాకాకుండా జిల్లా అభివృద్ధి, వైయస్ వివేక హత్య కేసు అనంతరం పరిణామాలు, అన్నకు వ్యతిరేకంగా షర్మిల ప్రచారం, కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల అరాచకాలు, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండడం, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు పని చేస్తే మాత్రం అధికార పక్షానికి ఇక్కడినుంచి కౌంట్ డౌన్ ప్రారంభమవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భాలలో ఉమ్మడి కడప జిల్లాలో సీట్లు పెరిగిన విషయం అక్షర సత్యం. ఇదే అభిప్రాయం తెలుగుదేశం పార్టీకి సీట్లు వస్తున్నాయని ఆ పార్టీ లెక్కలు వేస్తోంది. ప్రధానంగా రాజంపేట అసెంబ్లీ సెగ్మెంట్లో ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తాడో ఆ పార్టీ అధికారంలోకి రావడం గతకొన్ని దశాబ్దాలుగా జరుగుతోంది. ఈ ఎన్నికల్లో సెంటిమెంట్ కొనసాగుతుందా? తిరగబడుతుందా నేడు తేలనుంది.

# సర్వం సిద్ధం

### తోక ఆడిస్తే తాట తీస్తారు...
### సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ కేంద్రాలు
### కౌంటింగ్ కేంద్రాలలో మూడంచెల భద్రత
### మీడియా ప్రతినిధులకు ఆంక్షలు

రాజంపేట అర్బన్, జూన్3 ప్రభాతవార్త
కడప, రాయచోటి కేంద్రాలలో కౌంటింగ్ కు యంత్రాగం సర్వం సిద్ధం చేసింది. కౌంటింగ్ కేంద్రాలలో కట్టుదిట్టమైన ఏర్పాటు చేసింది. మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాలు అన్ని సీసీ కెమెరాల పర్యవేక్షణలో పనిచేస్తాయి. ఏ పార్టీ వారు తోక తిప్పినా తాటతీసేలా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుమార్లు కడప,అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు విజయరామరాజు, అభిశిక్త్ కిషోర్ లు మైక్రో పరిశీలకులు తో కలిసి కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రానికి ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. అధికారులకు అవసరమైన సలహాలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీలు కృష్ణారావు, సిద్ధార్థ కౌశల్ పర్యటించి అధికారులకు కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. మూడంచల భద్రతలో ఎక్కడ కూడా లోపాలు లేకుండా, ఉదాసీనతగా ఉండకుండా పనిచేయాలని పేర్కొన్నారు. ఎన్నికలలో ఇప్పటివరకు పని చేసిన తీరు ఒక ఎత్తని ఎన్నికల ఫలితాల సమయంలో పనిచేయడం ఒక ఎత్తని వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ పక్షాల వారు వేలెత్తి చూపించే విధంగా పనిచేయకుండా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కడప జిల్లా పరిధిలో ఆరు అసెంబ్లీ కేంద్రాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటింగ్ కేంద్రాలు పరిశీలించారు. అలాగే రాయచోటిలో ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. మీడియా ప్రతినిధుల



ప్రవేశానికి కూడా కఠినమైన ఆంక్షలు విధించారు.

కడప జిల్లాలో కౌంటింగ్ ఏర్పాట్లు
సోమవారం కలెక్టరేట్ వీసీ హాలులో సార్వత్రిక ఎన్నికలు-2024 ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ సన్నద్ధతపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు.. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తోకలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఓట్ల లెక్కింపుకు సంబంధించిన సన్నాహక ఏర్పాట్ల గురించి వివరించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మొత్తం 92.82% నమోదు కాగా.. అత్యధికంగా 96.77 శాతం మైదుకూరులో, అత్యల్పంగా 85.86 శాతం బద్వేల్ లో నమోదైంది. పోస్టల్ బ్యాలెట్ పోలైన మొత్తం ఓట్లు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో 22,645 ఓట్లు, పార్లమెంట్ నియోజకవర్గంలో 22,635 ఓట్లు పోలయ్యాయి. మూడంచెల భద్రత, సురక్షితమైన వాతావరణాన్ని నిర్ధారించేందుకు కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. మైక్రో అబ్జర్వర్లు 308 మంది ,కౌంటింగ్ సూపర్‌వైజర్ కౌంటింగ్ అసిస్టెంట్లు 603 మందిని కౌంటింగ్ సిబ్బందిగా నియమించారు.

# జగన్ మెజార్టీపై భారీ పందేలు

- కుప్పం ఫలితాన్ని పునరావృతం చేస్తామంటున్న తెదేపా
- గత మెజార్టీ కంటే ఎక్కువ సాధిస్తామంటున్న వైకాపా

పులివెందుల, జూన్ 3, ప్రభాతవార్త :
2024 సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల అసెంబ్లీ స్థానానికి మెజార్టీపై లక్షల రూపాయల్లో పందేలు జోరుగా సాగాయి. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబునాయుడుకు వచ్చిన మెజార్టీని పులివెందులలో కూడా ఈ దఫా ఎన్నికల్లో పునరావృతం అయ్యేలా చేస్తామంటూ తెదేపా శ్రేణులు బలంగా తమవాణిని వినిపిస్తున్నారు. గతంలో వచ్చిన మెజార్టీ కంటే ఈ దఫా ఎన్నికల్లో ఒక్క ఓటైనా ఎక్కువ వస్తాయంటూ వైకాపా నాయకులు తెదేపా నాయకులకు ప్రతి సవాల్ విసురుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే మెజార్టీపై వైఎస్ఆర్‌సీపీ శ్రేణుల్లో, అలాగే తెదేపా శ్రేణుల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇప్పటికే మెజార్టీపైన లక్షల రూపాయలను ఇరుపార్టీల వర్గీయులు సందేలు కాశారు. స్థానిక నాయకులపై ఉన్న అసంతృప్తి తమ బలమవుతుందని తెదేపా నాయకులు బలంగా విశ్వసిస్తున్నారు. వైకాపా శ్రేణులు మాత్రం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును మాత్రమే ప్రజలు గుర్తుకు పెట్టుకుని ఓటు వేశారంటూ విశ్వసిస్తున్నారు. గత 2019 ఎన్నికల్లో పులివెందుల అసెంబ్లీ స్థానానికి సంబంధించిన ఫలితాలను ఒకసారి పరిశీలిద్దాం..
పులివెందుల నియోజకవర్గంలో 180663 ఓట్లు పోల్ కాగా వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 132356 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి ఎస్‌వి సతీష్‌రెడ్డికి 42246 ఓట్లు రావడం జరిగింది. వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి జగన్‌మోహన్‌రెడి 90110ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మండల వారిగా చూస్తే సింహాద్రిపురం



మండలంలో 21720 ఓట్లు పోల్ కాగా 15943 వైఎస్ఆర్‌సీపీకి, 5033 టీడీపీకి వచ్చాయి. 10910 వైఎస్ఆర్‌సీపీకి మెజార్టీ వచ్చింది. లింగాల మండలంలో 20268 ఓట్లు పోల్ కాగా 15780 ఓట్లు వైఎస్ఆర్‌సీపీకి, 3699 ఓట్లు టీడీపీకి వచ్చాయి. 11911 ఓట్లు వైఎస్ఆర్‌సీపీకి మెజార్టీ వచ్చింది. పులివెందుల గ్రామీణ పరిధిలో 8477 ఓట్లు పోల్ కాగా 6860 ఓట్లు వైఎస్ఆర్‌సీపీకి, 1367టీడీపీకి వచ్చాయి. 5493ఓట్లు వైఎస్ఆర్‌సీపీకి మెజార్టీ వచ్చాయి. పులివెందుల పట్టణ పరిధిలో 39872 ఓట్లు పోల్ కాగా 30790 ఓట్లు వైఎస్ఆర్‌సీపీకి, 6094ఓట్లు టీడీపీకి వచ్చాయి. 23886 ఓట్లు వైఎస్ఆర్‌సీపీకి మెజార్టీ వచ్చింది. వేముల పరిధిలో 18801 ఓట్లు పోల్ కాగా 13445 ఓట్లు వైఎస్ఆర్‌సీపీకి, 4793 ఓట్లు టీడీపీకి వచ్చాయి. 8652ఓట్లు వైఎస్ఆర్‌సీపీకి మెజార్టీ వచ్చింది. తొండూరులో 16387 ఓట్లు పోల్ కాగా 11529 ఓట్లు వైఎస్ఆర్‌సీపీకి, 4328 ఓట్లు టీడీపీకి వచ్చాయి. 7201 ఓట్ల మెజార్టీ వైఎస్ఆర్‌సీపీకి వచ్చింది. వేంపల్లెలో 34361 ఓట్లు పోల్ కాగా 23449 ఓట్లు వైఎస్ఆర్‌సీపీకి, 9803 ఓట్లు టీడీపీకి వచ్చాయి. 13646 ఓట్ల మెజార్టీ వైఎస్ఆర్‌సీపీకి వచ్చింది. చక్రాయపేటలో 20277 ఓట్లు పోల్ కాగా 13980ఓట్లు వైఎస్ఆర్‌సీపీకి, 5971ఓట్లు టీడీపీకి, 8009 ఓట్ల మెజార్టీ వైఎస్ఆర్‌సీపీకి వచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌లో 580 వైఎస్ఆర్‌సీపీకి, 178 టీడీపీకి రాగా 462 ఓట్ల మెజార్టీ వైఎస్ఆర్‌సీపీకి వచ్చింది. కానీ ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 186833ఓట్లు పోల్ అయ్యాయి. ఏ మండలంలో కూడా గతంలో కంటే ఎక్కువ మెజార్టీ వైఎస్ఆర్‌సీపీకి వచ్చే అవకాశాలు లేవని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదిఏమైనా మంగళవారం ఏ పార్టీకి ఎన్నిక ఓట్లు వస్తాయన్న విషయమే ఉత్కంఠకు తెర పడనుంది.

# పవిత్ర ఖురాన్‌కు వ్యతిరేకంగా నిర్మించిన హమారే బారా సినిమాను నిషేధించండి

- రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల నేతలు డిమాండ్



కడప వైద్యవిభాగం, జూన్ 3, ప్రభాతవార్త: అత్యంత పరమ పవిత్రమైన ఖురాన్‌కు వ్యతిరేకంగా నిర్మించిన హందో హమారే బారా అనే హిందీ సినిమాను వెంటనే నిషేధించాలని వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు సోమవారం జిల్లా కలెక్టరు పేరున డీఆర్‌ఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇస్లాం సంప్రదాయం, సంస్కృతి, ముస్లింలు, ముస్లిం మహిళల నిబద్ధత, వారి వ్యతిరేకత జీవితాలను వక్రీకరిస్తూ అన్ను కపూర్ అనే దర్శక నిర్మాత సదరు హిందీ సినిమాను నిర్మించి ముస్లిం మనోభావాలను తీవ్రంగా గాయపరిచినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా దైవ గ్రంథమైన పవిత్ర ఖురాన్‌లోని సూర బకరాను వక్రీకరిస్తూ ట్రైలర్ విడుదల చేశారని ఆరోపించారు. ఈనెల 7వ తేదీన రిలీజ్ చేసే ముందుగా సదరు దర్శక నిర్మాత ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారని తెలిపారు. ఈ ట్రైలర్‌లో ఇస్లాం, ఖురాన్‌కు వ్యతిరేకంగా ట్రైలర్ చూపించారని విమర్శించారు. ముస్లిం మహిళలను కించపరుస్తూ ఇస్లాం సంప్రదాయాన్ని అవహేళన చేస్తూ ఇష్టం వచ్చిన రీతిన ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో చిత్రాన్ని నిర్మించారని ఆరోపించారు. అందువల్ల భారతీయ సినిమాటోగ్రఫీ చట్టం కింద నిషేధించాలని డిమాండ్ చేశారు. సినిమాను నిషేధించే వరకు ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నేత నజీర్ అహ్మద్, ప్రముఖ సంఘ సేవకుడు సలావుద్దీన్, ఏపీ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ ఉపాధ్యక్షుడు పఠాన్ మహ్మద్ అలీఖాన్, జేఏసీ జిల్లా కన్వీనర్ బాబు భాయ్, కడప వైద్యుల సంఘం ప్రతినిధి డా.నజిముద్దీన్, మత గురువులు జాకీర్ హుసేన్, అబ్దుల్ రెహమాన్, మిల్లి కౌన్సిల్ ప్రతినిధి నయీం, ఎస్‌డీపీ నేతలు తాహిర్

## చట్టాన్ని అతిక్రమిస్తే కఠినంగా శిక్షిస్తాం- ఎస్సై సుధాకర్



చిట్వేలి, జూన్ 3, ప్రభాతవార్త: నేడు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో మండలంలో మండల ప్రజలు సంయమనం పాటించి పోలీసు వారికి సహకరించాలని ఎస్సై సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం తాను మాట్లాడుతూ సెక్షన్ 144 మరియు పోలీసు చట్టం 30 అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. అత్యవసర దుకాణాలు తప్ప మిగిలినవి మూసివేయాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ప్రజలు అత్యవసరాలకు తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దన్నారు. నలుగురికి మించి గుంపులుగా ఉండడం, మద్యం సేవించి గొడవలు పడడం చేయరాదన్నారు. విజయోత్సవ సంబరాలు, ర్యాలీలు, బాణాసంచా కాల్చడం, పెద్ద శబ్దాలను చేయడం నిషేధమన్నారు. గెలిచిన వారు ఓడిన వారిపట్ల హేళన చేయడం, కేకలు వేయడం వంటి చర్యలు మానుకోవాలని ఎస్సై సుధాకర్ గట్టిగా హెచ్చరించారు.

## జాతీయ క్విజ్‌పోటీలకు జ్ఞానాంబిక విద్యార్థులు ఎంపిక



మదనపల్లెక్రైం, జూన్ 3 ప్రభాతవార్త పట్టణంలోని జ్ఞానాంబిక కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ తెలిపారు. వీరు మదనపల్లె నేషనల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ సెక్యూరిటీ మార్కెట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఫైనాన్సియల్ లిటరసీ క్విజ్ పోటీలకు ఎంపికయ్యారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్‌లో భాగంగా అన్‌లైన్‌లో కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన కె.రిషిత, ఎస్.సుజిత ముంబైలో జరిగే ఫైనాన్స్ క్విజ్ పోటీలకు ఎంపికయ్యారు. వీరికి ఈనెల 30న నగదుబహుమతిరూ.25వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, అద్యాపకులు అభినందించారు.

## దోమల నివారణకు మందులు పిచికారి సబ్‌యూనిట్ అధికారి విద్యాసాగర్



పీలేరు,జూన్ 03 ప్రభాతవార్తః ప్రస్తుతం దోమలు వద్ధి చెందే కాలం కావున ప్రజలు దోమల నిర్మూలనకు అందరూ బాధ్యత తీసుకోవాలని సబ్‌యూనిట్ అధికారి విద్యాసాగర్ అన్నారు.సోమవారం పట్టణంలో పద్మావతినగర్ లో 74 గహాల్లో మొత్తం 274 గదులకు , మరుగుదొడ్లు, మురికి కాలువ ప్రాంతాల్లో దోమల వద్ధి నిరోధకారైన మలాథియన్ పౌడర్ ఐఆర్‌ఎస్ ఇండోర్ రెసిడ్యూల్ స్ప్రే తగు మోతాదులో నీటితో కలిపి ఇంటి లోపల దోమ నివసించు ప్రాంతాల్లో పిచికారి చేయడం జరిగిందని, మలేరియా వ్యాధిని కలిగించే ఆడ అనాఫిలస్ దోమను అంతం చేయడమే దీని యొక్క ప్రధాన ఉద్దేశ్యం అని డాక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో పర్యవేక్షకులు శ్రీనివాసులు, కుసుమ, ఏఎన్‌ఎం విజయకుమారి, వెంకటరత్నం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎస్పీ విస్తృత పర్యటన

### - నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సిబ్బందికి ఎస్పీ ఆదేశం

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 3, ప్రభాతవార్త: ఈనెల 4న మంగళవారం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్



జరగనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సోమవారం ప్రొద్దుటూరు పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ముఖ్య కూడళ్లలో బందోబస్తును పరిశీలించారు. కొత్తపల్లి జంక్షన్, శివాలయం సర్కిల్, రాజీవ్ సర్కిల్, విజయ్‌కుమార్ సర్కిల్, వైఎస్ఆర్ సర్కిల్ వద్ద బందోబస్తు పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్, ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, టుటౌన్ సీఐ అబ్దుల్ కరీం, త్రీటౌన్ సీఐ వెంకటరమణ, రూరల్ సీఐ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



లక్కిరెడ్డిపల్లె,జూన్ 3,ప్రభాతవార్త:

మండలంలోని పాళెం బుర్జుపల్లెకు చెందిన సుదర్శన్ బాబు 38 అనే వ్యక్తి గత వారం రోజులుగా కనిపించలేదని బాదితుని తల్లి తండ్రీ కొండయ్య,తమ్ముడు నారాయణలు ఇచ్చిన పిర్యాదు మేరుకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు వివరాలు మేరకు ఇలా ఉన్నాయి పాలెం బురుజుపల్లెకు చెందిన సుదర్శన్ బాబు మంగళవారం 28వ తేదీన సాయంత్రం స్నేహుతులతో కలసిపల్లెకు సమీపంలో ఉన్న శేషాల అడివిలోకి ఏదోపనిపై వెల్లారని అయితే సుదర్శన్ వెంట వెల్లిన స్నేహితులు తిరిగి ఇంటికి వచ్చారని తమ బిడ్డ సుదర్శన్బాబు మాత్రం ఇంటికి రాలేదని మరసిటి రోజు బుదవారం అడవింతా వెతికామని ఎక్కడ కనిపించలేదని ఎమైనాడోనని భాదితుని తల్లిదండ్రులు,భార్య పిల్లలు భాదితుని తల్లిదండ్రులు,భార్య పిల్లలు భాదపడుతున్నారని,వారం రోజులైన ఇంతవరకు ఇంటికి రాకపోవడంతో పోలీసులకు పిర్యాదు చేశారని భాదితుని భందవులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## డిగ్రీ తో కూడా అధిక వేతనాలు సాధించవచ్చు

### నార్త్‌స్టార్ అకాడమి డైరెక్టర్ ఇర్ఫాత్



పీలేరు, జూన్ 03 ప్రభాతవార్తః డిగ్రీ విద్యను చిన్నచూపు చూడాల్సిన పనిలేదని డిగ్రీతో కూడా అధిక వేతనాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని ప్రముఖ సంస్త నార్త్ స్టార్ అకాడమి డైరెక్టర్ ఇర్ఫాత్ పేర్కొన్నారు. పట్టణంలోని సీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం పీలేరు పరిసర ప్రాంత విద్యార్థులకు ఇంటర్ తరువాత విద్య ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీతో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందలేమన్న అపోహాలో చాలామంది విద్యార్థులు ఉన్నారని మారిన సాంకేతిక ఆర్థిక జీవనోపాదుల నేపథ్యంలో డిగ్రీతో కూడా మంచి ఉపాధి అవకాశాలు సిద్దంగా ఉన్నాయన్నారు. ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్న సంస్థలు ఉద్యోగార్థులు విద్యార్హతలు కాకుండా వారిలో టెక్నికల్ విద్యపట్ల ఎక్కువగా దష్టి సారిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో సీఎన్ఆర్ కళాశాల కరెస్పాండెంట్ విజయ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య,అధ్యాపకులు బాలాంజనేయులు , బోదేషావలి, రాధాకష్ణ, మహేష్, కిరణ్, జ్ఞానశ్రీ, అజిత, అరుణ షభనం తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణ సేవలు మెరుగుపరుస్తాం డాక్టర్ రమేష్‌రెడ్డి



పీలేరు, జూన్ 03 ప్రభాతవార్తః ఆశించిన స్థాయిలో వ్యాధులు లేని పల్లెలు సాధ్యపడాలంటే ఆరోగ్య సంరక్షణ సేవల్లో బాధ్యతతో పాటు మరింత నైపుణ్యం పెరగాలని పీహెచ్‌సీ తలపుల ప్రధాన వైద్యాధికారి రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు నిర్వహించిన సమావేశంలో రమేష్‌రెడ్డి దివ నిర్దేశం చేశారు. మహిళా శిశు ఆరోగ్యం, పౌష్టికాహారం వ్యక్తిగత పరిసర , తాగునీటి పరిశుభ్రత వ్యాధుల నిర్ధారణ తదితర అంశాలపై నివారణ చర్యలు చేపట్టి సాధించిన ఫలితాలు రికార్డ్సు కంప్యూటరీకరించడం చేయాలని ఆదిశగా పరిజ్ఞానాన్ని మరింత పెంచుకుని ప్రజలకు మీరు చేసే ఆరోగ్యసేవలు చెప్పే ఆరోగ్యసూత్రాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి ఫలితంగా తల్లిబిడ్డ మరణాలు పూర్తిగా తగ్గించి ఆరోగ్యకర జీవనం దిశగా ప్రోత్సహించాలని సీహెచ్‌ఓలని రమేష్‌రెడ్డి కోరారు. ఈకార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, కష్ణయ్య, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు, జూన్ 03 ప్రభాతవార్తః సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం జరుగుతున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పీలేరు మండలం మొత్తం ప్రభుత్వం 144 సెక్షన్ విధించిందని పీలేరు సీఐ మోహన్‌రెడ్డి, ఎస్సై నరసింహుడు అన్నారు. సోమవారం పీలేరు పోలీసులు స్టేషన్ పరిధిలోని రక్షబటులు పురవీధులలో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలంలో ఎక్కడా టీకొట్టులు తెరవరాదని మంగళవారం జరిగే వారపు సంత కూడా రద్దుచేయడం జరిగిందన్నారు. హోటళ్లు, దుకాణాలు, ప్రజలు సౌకర్యార్థం తెరుచుకోవచ్చని అయితే అక్కడ కూడా నిబంధనలు పాటించి నలుగురు కన్నా ఎక్కువ గుమికూడరాదని వారు స్పష్టం చేశారు. ఔద్విచక్రవాహనాలలో యువకులు అనవసరంగా తిరిగిన పక్షంలో వాహనాలు స్వాధీనం చేసుకుంటామని వారు స్పష్టం చేశారు.

## బందోబస్తు ఏర్పాట్లపై ఎస్పి సమీక్షా సమావేశం,

మైదుకూరు జూన్ 3, ప్రభాతవార్త ,

నేడు జరుగు సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సంధర్భంగా మైదుకూరులో బందోబస్తు ఏర్పాట్లపై సోమవారం మైదుకూరు డిఎస్పి కార్యాలయంలో జిల్లా ఎస్పి సిదార్ధ్ కౌశిల్ పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.ప్రధాన కూడళ్లలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ట్రబుల్ మాంగర్‌ల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.కౌంటింగ్ సంధర్భంగా 144సెక్షన్ క్రింద నిషేధాజ్ఞలు పకడ్బందిగా అలు చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మైదుకూరు డిఎస్పి.వెంకటేసులు,అర్బన్ సి.ఐ.ఎపి మస్తాన్ రూరల్ సి.ఐ శ్రీనాథ్‌రెడ్డి,ఎస్సైలు, రాజ రాజేశ్వర్ రెడ్డి,ఘణ మద్దులేటిలు పాల్గోన్నారు.

## పిడుగుపాటుతో తాటిచెట్టు దగ్ధం

తొండూరు, జూన్ 3, ప్రభాతవార్త ః

తొండూరు మండల పరిధిలోని అగడూరులో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు తాటిచెట్టు దగ్ధమైంది. జనసంచారం లేని ప్రాంతంలో పిడుగు పడడంతో ఎటువంటి ప్రమాదాలు జరగలేదు. వర్షాలు కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశాలున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

## మలేరియా వ్యతిరేక మాసోత్సవము

జాతీయ కీటక జనిత వ్యాధులపై నియంత్రణ, మరియూ,

ఫ్రై డే డ్రై డే, కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం,

ఎస్ . బ్రహ్మజీ సబ్ - యూనిట్ యూనిట్ అధికారి,

బద్వేల్ జూన్ 3, ప్రభాతవార్త:

బద్వేల్ మండలం తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రము పరిధి లోని బాలయ్యపల్లి సచివాలయం బాలయ్యపల్లి హరిజనవాడ నందు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించడం జరిగింది. జాతీయ కీటక జనిత వ్యాధులపై వైద్య సిబ్బంది కి ఆశా కార్యకర్తలకు మరియూ గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్నిఎస్ బ్రహ్మజీ మలేరియా సబ్ యూనిట్ అధికారి బద్వేల్, మరియు హెల్త్ ఎడ్యుకేటర్ బి. వెంగయ్య నిర్వహించడం జరిగింది. అంటువ్యాధులు,వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్ర త, దోమలార్వా నియంత్రణ, ఈ కార్యక్రమం లో మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చి కెన్ గున్యా , మెదడువాపు, మొదలగు వ్యాదుల పై ప్రజలకు అవగాహన కల్పించారు.



## హమ్ దో హమారే సినిమా విడుదల నిలుపుదల చేయాలి

### - మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి




కడప వైద్యవిభాగం, జూన్ 3, ప్రభాతవార్త: మైనార్టీ బావనలు దెబ్బతీసే విధంగా చిత్రీకరించిన హమ్ దో హమారే బరాహ్ సినిమా జూన్ 7న విడుదల నిలుపుదల చేయాలంటూ దేశ వ్యాప్తంగా మత సంస్థలు నిరసన వ్యక్తం చేస్తున్నాయని సినిమా వివాదాల్లో కూరుకుపోయిందనడానికి సినిమా టీజర్‌లో మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రసారమవుతున్నదని తక్షణం నిలుపుదల చేయాలని ఏంద్ర ప్రభుత్వాన్ని మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి విజ్ఞప్తి చేశారు. స్థానిక మైనార్టీ రైట్స్ ఫోర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షేక్ దస్తగిరి మాట్లాడుతూ ఈ సినిమాలో ముస్లిం మహిళలు కేవలం పిల్లలను కనే వారిగానే చూపిస్తూ దేశ జనాభా కూడా ముస్లిం వర్గాల ద్వారానే పెరుగుతుందంటూ వారి సంప్రదాయాలను కించపరిచే ఉద్దేశంతోనే నిర్మించారంటూ మండిపడ్డారు. మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టేలా సినిమా టీజర్ ఉందని ఈ చిత్రాన్ని నిషేధించాలని మత సంస్థలు డిమాండ్ చేస్తున్నామని గుర్తు చేశారు.

## ప్రయాణం సురక్షితం..




కడప కార్పొరేషన్, జూన్ 3, ప్రభాతవార్త: ప్రయాణం చేసే సమయంలో రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులురెడ్డి విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాల వేసవి శిక్షణ విజ్ఞాన శిబిరంలో సోమవారం కడప జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రోడ్డు నియమాలు, రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల గురించి తాను రూపొందించిన ఛాయా చిత్ర పోస్టర్లు వివరాలను విద్యార్థులకు శ్రీనివాసులురెడ్డి వివరించారు. రోడ్డు నియమాలను తెలుసుకొని దారులలో అడ్డంకులు సృష్టించకుండా పరిమితవేగంతోనూ, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్ వంటి వాటిని అవలంభించకుండా బాధ్యత వహించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ ఇ.పవన్‌కుమార్, లైబ్రేరియన్ బాజ్జీ, సురేష్, సుబ్రమణ్యం, జేమ్స్, సీనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస చార్, సిబ్బంది సుబ్బమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని చర్చీలో ప్రార్థనలు




కడప కార్పొరేషన్, జూన్ 3, ప్రభాతవార్త: వైసీపీ దళిత నాయకులు పల్లెకొండు సంపత్, చైతల్య ఆధ్వర్యంలో కడప రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆరోగ్యమాత చర్చిలో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని, ఆంధ్ర రాష్ట్ర సంక్షేమ సంతోషం పొందుకోవాలని ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ కలలు గన్న రాజ్యాంగబద్ధమైన పాలన అందిస్తూ ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించిన జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారం చేపట్టాలని ఆ ప్రభువు దీవెనలు ఆయనకు మెండుగా ఉండి జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలని ఆకాంక్షించారు. కడప ఎమ్మెల్యేగా అంజాద్‌బాషాతో పాటు జిల్లాలోని 10 వైసీపీ అభ్యర్థులు గెలుపొందాలని ప్రార్థన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంసన్, యోహాన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## మాసాపేటలో గోడ కూలి మహిళ మృతి



రాయచోటి గ్రామీణ, జూన్ 3, ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మాసాఎపేటలో 2వ వార్డు కౌన్సిలర్ పద్మావతి ఆడబిడ్డ సుగవాసి శ్యాంకుమార్ చెల్లెలు ఇంటి నిర్మాణం చేపడుతుండగా 3వ అంతస్తుపై నుంచి గోడ కూలి మార్జాల లక్ష్మీ ప్రసన్న (40) మృత్యువాత పడింది. ఈమె వాలంటీర్‌గా పని చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి 3 అంతస్తుల గోడ కూలి అన్యాయంగా తమ బిడ్డ మృతి చెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు, రాయచోటి ఏరియా ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

## నేడు బంద్‌కు సహకరించాలి- అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి



రాయచోటి గ్రామీణ, జూన్ 3, ప్రభాతవార్త: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో రాయచోటి పట్టణంలో మంగళవారం 144 సెక్షన్ అమల్లో ఉన్నందున వ్యాపారులు, ప్రజలు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా దుకాణాలు మూసి అలాగే ఎమర్జెన్సీ సర్వీసులు మాత్రమే మినహాయింపు ఉంటుందని తెలిపారు. రోడ్డుపైన ఎక్కడ పడితే అక్కడ గుంపులుగా జనాలు ఉన్నట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయయని అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు భక్తవత్సలం, లోకేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారిపై గుంతలు పూడ్చివేత



తొండూరు, జూన్ 3, ప్రభాతవార్త ః తొండూరు మండలంలోని కృష్ణంగారిపల్లె బస్టాప్ వద్ద రోడ్డుపై గుంతలను అధికారులు పూడ్చివేయించారు. ఈ మార్గంలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై మే 31న 'వార్త' దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు గుంతలు ఏర్పడేందుకు కారణమైన పైపులైను లీకేజిని అరికట్టి మరమ్మతులు చేయించారు. అలాగే గుంతలను పూడ్చివేయించారు. సమస్య పరిష్కారం కావడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.


కడపలో కౌంటింగ్ కు సిద్ధమైన ఏర్పాట్లు


కడపలో కౌంటింగ్ కోసం అన్ని వైపులా సిద్ధం చేసిన సీసీ కెమెరాలు



కడపలో ఎన్నికలు ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థ కౌశల్



పోస్టల్ బ్యాలెట్ కోసం సిద్ధమైన కౌంటింగ్ హాల్


రాయచోట్లు కౌంటింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



రాజంపేట కౌంటింగ్ గతంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

# కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన మూడంచెల భద్రతా వ్యవస్థ

కడప, జూన్ 3 :

వై.యస్.అర్ జిల్లాలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ ప్రక్రియను సజావుగా, సమ్మిళితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాలుగా భద్రతా ఏర్పాట్లను పూర్తిచేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు.

సోమవారం కలెక్టరేట్ వీసీ హాలులో సార్వత్రిక ఎన్నికలు-2024 ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ సన్నద్ధతపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు.. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తోకలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఓట్ల లెక్కింపుకు సంబంధించిన సన్నాహక ఏర్పాట్ల గురించి వివరించారు.

ఎలక్టోరల్ డెమోగ్రాఫిక్స్ మరియు స్టాటిస్టిక్స్:

పార్లమెంటరీ నియోజకవర్గం : 1

అసెంబ్లీ నియోజకవర్గాలు : 7

01.01.2024 నాటికి అంచనా వేసిన జనాభా : 22,47,356 (పురుషులు: 11,11,359బీ స్త్రీలు: 11,35,997బీ లింగ నిష్పత్తి: 1022)మొత్తం ఓటర్లు:లి 16,39,066 (పురుషులు: 8,00,857బీ స్త్రీలు: 8,37,993బీ థర్డ్ జెండర్: 216 నిష్పత్తి: 729బీ లింగ నిష్పత్తి: 1,046)లిమొత్తం పోల్ శాతం:లి 79.58% అత్యధిక పోల్ 86.68% : జమ్మలమడుగు అసెంబ్లీ

అత్యల్ప పోలింగ్ 65.27%. : కడప అసెంబ్లీ

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మొత్తం :లి 92.82% నమోదు కాగా.. అత్యధికంగా 96.77 శాతం మైదుకూరులో, అత్యల్పంగా 85.86 శాతం బద్వేల్ లో నమోదైంది.

పోస్టల్ బ్యాలెట్ పోలైన మొత్తం ఓట్లు:లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 22,645 ఓట్లు, పార్లమెంట్ నియోజకవర్గంలో 22,635 ఓట్లు (సర్వీస్ ఓటర్లు మినహా) పోలయ్యాయి.

సర్వీస్ ఓటర్లు (2,283 ఓటర్లు):03.06.2024 నాటికి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 854 ఓట్లు, పార్లమెంట్ నియోజకవర్గాల్లో 699 ఓట్లు పొలయ్యాయి.

భద్రతా ఏర్పాట్లు:

మూడంచెల భద్రత: సురక్షితమైన వాతావరణాన్ని నిర్ధారించేందుకు కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

సిబ్బంది నియామకము : లిమైక్రో అబ్జర్వర్లు:లి 308 మంది మైక్రో అబ్జర్వర్‌లను నియమించారు, అవసరమైన మేరకు 120% నియామకం చేపట్టడం జరిగింది.

కౌంటింగ్ సూపర్‌వైజర్ %ఽ% కౌంటింగ్ అసిస్టెంట్:లి 603 మందిని కౌంటింగ్ సిబ్బందిగా, కౌంటింగ్ అసిస్టెంట్‌లుగా అవసరమైన 120% మేరా నియామకం చేపట్టడం జరిగింది.

శిక్షణ మరియు రాండమైజేషన్

శిక్షణా సెషన్‌లు:కౌంటింగ్ సూపర్‌వైజర్లు అసిస్టెంట్లు, %ూ=ూ%లతో సహా కౌంటింగ్ సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణా ఇవ్వడం జరిగింది. మైక్రో అబ్జర్వర్‌ల కు ఎన్నికల పరిశీలకుల సమక్షంలో ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించడమైనది.కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్:

1వ రాండమైజేషన్: 29.05.2024న పూర్తయింది.

2వ రాండమైజేషన్: 02.06.2024న పూర్తయింది.

3వ రాండమైజేషన్: 04.06.2024న షెడ్యూల్ చేయబడింది.

లెక్కింపు ప్రక్రియ ప్రారంభ సమయము :

పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉదయం 8.00 గంటలకు ప్రారంభమవుతుంది. %జుఎవీ% కౌంటింగ్ ఉదయం 8.30 గంటలకు ప్రారంభమవుతుంది.

పరిమితులు:కౌంటింగ్ ఏజెంట్లను ఉదయం 7 గంటల తర్వాత ఎట్టిపరిస్థితుల్లోనూ లోనికి అనుమతించబడరు. అలాగే కౌంటింగ్ పూర్తయ్యే వరకు కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రం నుండి బయటకు వెళ్లడానికి అనుమతించబడరు. రిటర్నింగ్ అధికారి (%=ూ%) టేబుల్ వద్ద పోటీ చేసే అభ్యర్థి లేదా ఎన్నికల ఏజెంట్‌ను ఒకేసారి అనుమతించారు.

కౌంటింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా వారికి కేటాయించిన టేబుల్‌ల వద్దే ఉండాలి. కౌంటింగ్ హాల్‌లో తిరగడానికి అనుమతించబడరు.

ధృవీకరణ మరియు పరిశీలకులు:

ధృవీకరణ: మరియు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పూర్తయిన తర్వాతే.. 5 మెషీన్ల స్లిప్‌ల ధృవీకరణ పూర్తి చేయబడుతుంది.

పరిశీలకులు: భారత ఎన్నికల సంఘం పరిశీలకులు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉంటారు.

నియమాలు మరియు నిషేధాలు:లి

మొబైల్ ఫోన్లు: అనుమతించిన సిబ్బందికి మినహా కౌంటింగ్ హాలులో నిషేధించబడింది.

కౌంటింగ్ ఏజెంట్ల కోసం అనుమతించబడిన వస్తువుల వివరాలు ఇళ్ల ఉన్నాయి.

ఫారం 17-%జ% కాపీ, పెన్/పెన్సిల్, సాదా కాగితం/నోట్‌ప్యాడ్ మాత్రమే.

గుర్తింపు కార్డులు:లి అభ్యర్థులందరూ, కౌంటింగ్ ఏజెంట్లు మరియు కౌంటింగ్ సిబ్బంది తమ గుర్తింపు కార్డులను తప్పనిసరిగా ధరించాలి.

అపాయింట్‌మెంట్ లెటర్‌లు: కౌంటింగ్ హాల్‌లోకి ప్రవేశించడానికి కౌంటింగ్ ఏజెంట్లు అపాయింట్‌మెంట్ లెటర్ యొక్క రెండవ కాపీని తప్పనిసరిగా సమర్పించాలి.

మీడియా మరియు కమ్యూనికేషన్:

మీడియా సెంటర్ మరియు పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్ ను కౌంటింగ్ సెంటర్‌లో ప్రాంగణంలోనే ఏర్పాటు చేయబడింది. అనుమతి పొందిన మీడియా పర్సన్స్ కు మాత్రమే మీడియా సెంటర్ వరకు మొబైల్ ఫోన్‌లను తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది.

రౌండ్ వారీ ఫలితాలు :రౌండ్ వారీగా ఫలితాల కాపీలు కౌంటింగ్ ఏజెంట్లు మరియు మీడియా సెంటర్‌కు అందించబడతాయి.

అసెంబ్లీ నియోజకవర్గాలు..

సాధారణ సమాచారం: ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం (ఏసీ)లో కౌంటింగ్ కోసం 14 టేబుల్స్ ఉంటాయి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2 అదనపు పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగింది.

మినహాయింపులు:

కడప, ప్రొద్దుటూరులో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు స్టాండర్డ్ 2కి బదులు 3 టేబుల్స్ ఉన్నాయి.

కౌంటింగ్ రౌండ్లు: జమ్మలమడుగు: అత్యధిక రౌండ్లు (23 రౌండ్లు). కమలాపురం: అత్యల్ప రౌండ్లు (18 రౌండ్లు).

పార్లమెంటరీ నియోజకవర్గాలు (

సాధారణ సమాచారం:

పార్లమెంటరీ నియోజకవర్గం ( పరిధిలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో %జుఎవీ% లెక్కింపు కోసం 14 టేబుల్స్ ఉంటాయి.

కడప కోసం నిర్దిష్ట సమాచారం:

కడప పీసీలో పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం 14 టేబుల్స్ ఉన్నాయి. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రత్యేక హాలులో 4 రౌండ్లలో జరుగుతుంది.

అదనపు సమాచారం

సీలింగ్: ఫలితాలు పూర్తయిన తర్వాత చేయాలి. ఏజెంట్లు/ప్రతినిధులు హాజరు కావాలి.

ఫలితాల నమోదు: అన్ని ఫలితాలు రౌండ్ వారీగా ఎన్‌కోర్‌లో నమోదు చేయబడతాయి.

కౌంటింగ్ పూర్తయ్యే సమయం అంచనా..:

నియోజకవర్గ ఫలితాలు మధ్యాహ్నం 3.00 గంటలకు. పార్లమెంటరీ నియోజకవర్గ ఫలితాలు దాదాపు సాయంత్రం 4.00 గంటలకు పూర్తవ్వొచ్చు.

చట్టానికి లోబడి..

చట్టం 1951: ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 ప్రకారం కౌంటింగ్ నిర్వహించబడుతుంది. జాతీయ మరియు రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీ ఏజెంట్లకు కౌంటింగ్ హాల్‌లో ప్రాధాన్యతతో సీటింగ్ ఏర్పాటు చేయడమైనది.

పార్కింగ్ ఏర్పాట్లు...

1.వైఎస్ఆర్‌సీపీ పార్టీ:

స్థలం: ఇందిరానగర్ ఎదురుగా.

దూరం: 100 మీటర్ల చెక్ పోస్ట్ నుండి 600 మీటర్లు.

లి2.%ఴఖూ ఽ% అలయన్స్ పార్టీలు:లి

స్థానం: శిల్పారామం పక్కన.

దూరం: 100 మీటర్ల చెక్ పోస్ట్ నుండి 750 మీటర్లు.

3.కౌంటింగ్ స్టాఫ్ మరియు డ్యూటీ ఆఫీసర్లు:లి

స్థానం: మోంట్‌ఫోర్ట్ స్కూల్.

కౌంటింగ్ హాలులో వైద్య, అగ్నిమాపక బృందాలతో సహా అవసరమైన అన్ని ఏర్పాట్లు సంసిద్ధం చేయడం జరుగుతుంది.



# నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

## ఫలితాలకోసం ఉత్కంఠంగా ఎదురుచూపులు

## ఎగ్జిట్‌పోల్స్ ఇచ్చినా ఎవరి ధీమా వారిదే



మదనపల్లె, జూన్ 3 ప్రభాతవార్త :

గత 20రోజులుగా ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనున్నది. ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థుల జాతకాలు నేడు తేలనున్నాయి. ఫలితాల కోసం అభ్యర్థులతో పాటు పార్టీ క్యాడర్ ఉత్కంఠంగా ఎదురుచూస్తోంది. ఎన్నికల్లో గెలుపు ఓటములపై ఎగ్జిట్‌పోల్స్ సర్వే ఇచ్చినా ఎవరి ధీమా వారిదే ఉంది. ముఖ్యంగా వైకాపా, తెలుగుదేశం పార్టీ నాయకులు తామే గెలుపొందుతామంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీకే ఎక్కువుగా ఎగ్జిట్‌పోల్స్ సర్వే ఇచ్చాంటూ బాహాటంగా ఇరుపార్టీల వారు ఎవరికి వారు చెప్పుకోవడం జరుగుతోంది. ఏది ఏమైనా ఎన్నికల ఓట్ల లెక్కింపు ఫలితాలు గంటల వ్యవధిలో తేలనుండడంతో ప్రతి ఒక్కరిలోనూ టెన్షన్ నెలకొంది. ఎన్నికల కమీషన్ అన్ని రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. పట్టణాల్లో 144సెక్షన్ కూడా విధించింది. ఎగ్జిట్‌పోల్స్ సర్వేను కూడా పక్కనపెట్టి ఇరుపార్టీలకు చెందిన నాయకులు,కార్యకర్తలు బెట్టింగులు జోరుగా వేసుకోవడం జరిగింది. దేశవ్యాప్తంగా మంగళవారం వెలుబడే ఎంపి, ఎమ్మెల్యే ఎన్నికల ఫలితాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ఫలితాలు రోజు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చేపట్టారు. పట్టణాల్లోని ప్రధాన కూడలిలో ప్రజలు గుమికూడే ప్రాంతాల వద్ద పోలీస్ నిఘాను ఏర్పాటు చేశారు. మద్యం షాపులు సైతం మూడు రోజులు పాటు మూత పడ్డాయి. ఇక టీ దుకాణాల వద్ద ఎక్కువుగా జనాలు ఉండనీయకుండా టీ దుకాణాలు మూసివేయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని ప్రాంతాలు పోలీసులు నిఘానీడలో ఉండనున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికలు రెండు ప్రధాన పార్టీలకు సవాలుగా నిలిచాయి. తమపార్టీకి చెందిన నాయకుడే ముఖ్యమంత్రి అవుతారంటూ ఇరుపార్టీలు వారు ప్రధానంగా చెప్పుకోవడం జరుగుతోంది. టిడిపి పొత్తులో ఉన్న బిజెపి, జనసేన పార్టీల అభ్యర్థుల గెలుపుపై కూడా బెట్టింగులు వేసుకొంటున్నారు. ఎన్నికల ఫలితాలకు సంబంధించి ఇంత ఉత్కంఠంగా ఉంటున్న సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఊసు ఎత్తే నాయకుడే కరువయ్యాడు. సోషల్‌మీడియాలో కూడా రాష్ట్ర ఎన్నికల ఫలితాలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ గురించి ఎక్కడా ప్రచారం జరిగిన దాఖలాలు లేవు. మంగళవారం మధ్యాహానికి వైకాపా, టిడిపిలకు సంబంధించి భవితవ్యం తేలనున్నది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మరో పార్టీ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉంటుందంటూ చర్చించుకోవడం జరుగుతోంది.

## బద్వేలులో నేడు 144 సెక్షన్ అమలు

బద్వేలు, జూన్ 3 ప్రభాతవార్త :



మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఫలితాల సందర్భంగా బద్వేలు పట్టణంలోఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా పట్టణంలో 144 సెక్షన్

మరియు 30 పోలీసుయాక్ట్ అమలులో ఉందని బద్వేలు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ సత్యనారాయణలు పేర్కొన్నారు ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువగా ఎక్కడ ప్రజలు గుమికూడరాదని, పట్టణమంతా సీసీ సెమెరా నిఘాలో ఉంది కావున జూన్ 3వ తేది రాత్రి నుంచి 4వ తేది వరకు పట్టణంలో రెస్టారెంట్లు కానీ, హోటల్స్ కానీ, లాడ్జీలు కానీ అన్నిమూసివేయాలన్నారు. అలాగే పట్టణంలో ఎక్కడే గాని బహిరంగ భోజనాలు, సంబరాలు చేయరాదని, లాడ్జీల్లోకళ్యాణ మండపాలలో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఉండదన్నారు. అలాగే జూన్ 6వ తేది వరకు ఎలాంటి ఉత్స వాలుగాని, సంబరాలు చేసేందుకు అనుమతి లేదన్నారు. అలాగే బాణసంచా కాల్చడం, రెచ్చగొట్టేలా మట్లాడడం చేయరాదన్నారు.ఎవరైనా పోలీసువారి ఉత్తర్వులు పాటించకపోతే అలాంటి వారపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వేరుశెనగ తీసుకున్న రైతు విత్తనం కోసం ఉపయోగించాలి - డిఏఓ



చిన్నమండెం, జూన్ 3, ప్రభాత వార్త :

వేరుశెనగ కాయలు తీసుకొన్న ప్రతి రైతు వాటిని విత్తనం కోసం ఉపయోగించాలని అన్నమయ్య జిల్లా డిఏఓ చంద్రానాయక్ పేర్కొన్నారు. ఆయన సోమవారం మండల కేంద్రంలోని 1వ సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న వేరుశెనగ విత్తన కాయల పంపిణీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు తీసుకొన్న రైతు సరిగా పంట సాగు చేసి ఈ పంటలో ఖచ్చితంగా నమోదు కావాలన్నారు. లేని యెడల విత్తనం ధర తిరిగి చెల్లించాలని, ప్రభుత్వ పథకాలకు అనర్హులు అవుతారన్నారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది వేరుశెనగ విత్తన కాయల నాణ్యత పరిశీలించి బాగోలేకుంటే వెనక్కు పంపాలని తెలియజేశారు. రైతు దగ్గర నుండి ఎటువంటి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని, అధికారులు అలసత్వం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని అధికారులకు సూచించారు. మండలానికి సాధారణ విస్తీర్ణాన్ని బట్టి 860 క్వింటాళ్లు అలాట్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓలు గీత, రమేష్‌రాజు, ఎఇఓ బ్లేస్సీ, రైతులు పాల్గొన్నారు.

## మండలంలో పక్కాగా 144 సెక్షన్ అమలు - కౌంటింగ్ దృష్ట్యా ఆంక్షలు కఠినం

గాలివీడు, జూన్ 31(ప్రభాతవార్త):



సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా మంగళవారం మండలంలో 144 సెక్షన్ పక్కాగా అమలు చేయనున్నట్లు గాలివీడు ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు ఎవ్వరూ రాకూడదన్నారు. నలుగురు కంటే ఎక్కువ మంది ఒకే చోట గుమికూడవద్దని, బాణసంచా పేలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రాయచోటి కౌంటింగ్ కేంద్రం వద్దకు కేవలం పాసులు, అనుమతి కలిగిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని ఇతరులెవ్వరూ అక్కడికి వెళ్లరాదన్నారు. సీసీ కెమెరాలతో మండలమంతా నిఘా ఉంచామని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

## చిన్ననాటి నుండి కథలు నేర్చుకోవాలి



ప్రొద్దుటూరు, జూన్ 03, ప్రభాతవార్త: ప్రొద్దుటూరు బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్ నందు సోమవారం నిర్వహించిన సమ్మర్‌క్యాంప్‌లో 19మంది విద్యార్థులు హాజరయ్యారని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వైమానిక దళ ఎ.ఇ వెంకటకొండయ్య,ఉపాధ్యాయురాలు యస్.నిర్మల జ్యోతి విచ్చేసి విద్యార్థులతో మాట్లాడుతూ చిన్న తనం నుండి కథలు నేర్చుకోవాలని వివరించారు. విద్యార్థులకు అడవి జంతువుల కథలువైద్యం నేర్పిన కోతి, నక్కకు గుణపాఠం, ఎలుగుబంటి పథకం లాంటి కథలు వినిపించి విద్యార్థులకు రక్తికట్టించారు. అనంతరం విద్యార్థులతో ఖో ఖో, క్యారంబోర్డు, పరమపద సోపానపటం ఆటలు ఆడించారన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ సిబ్బంది రెహ్మాన్ ఖాన్, సారమ్మలు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పర్యవేక్షణ పోలీసుల లక్ష్యం



ముద్దనూరు, జూన్ 03, ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మంగళవారం నాడు జరగనున్న దృష్ట్యా కడప జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు సోమవారం నాడు ఇంచార్జ్‌డీఎస్పీ శ్రీనివాసులు మరియు సీఐ దస్తగిరి ప్రజలు గుంపుగుంపులుగా ఉండటం, చర్చలు పెట్టుకోవడం, అదేపనిగా రాత్రివేళల్లో వీధుల్లో తిరగడంలాంటివి చేయకూడదని,నియమ నిబంధనలు అతిక్రమించే వారిని ఎంతటివారైనా సరే చర్యలు తప్పవని తెలిపారు. అదేవిధంగా ముద్దనూరు పాతబస్టాండ్‌లో, నాలుగు రోడ్ల కూడలి నందు మరియుపురవీధుల్లో తిరుగుతూ ఆయన మైక్ ద్వారా తగు జాగ్రత్తలు తెలియజేశారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికల విశయమై ఎటువంటి విభేధాలకు రెచ్చగొట్టే వ్యాఖ్యలకు పోవద్దనిపేర్కొన్నారు. ముద్దనూరు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఎన్నికలపై మంగళ, బుధవారాల్లో ఎలాంటి చర్చలు, గొడవలకు పాల్పడవద్దని, 144సెక్షన్ అమలులోఉందని తెలిపారు. ముఖ్యంగా సున్నితమైన గ్రామ పంచాయతీల్లో సమస్యకు దిగవద్దని మండలమంతా తిరుగుతూ సీఐ వివరించారు. ప్రశాంతమైన పద్ధతులు అవలంభించుకోవాలనిఏ ఒక్క చోట కూడ ఐదారు మంది కలిసి ఉండకూడదని, షాపులు కూడ మంగళవారం మైసి ఉండాలని, ఏ చిన్న సమస్య ఉన్నట్లు తమ దృష్టకి తీసుకువచ్చినా కఠిన చర్యలుతప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

పుల్లంపేట, జూన్ 03, ప్రభాతవార్త:



మండల పరిధిలోని పుత్తనవారిపల్లె సమీపంలోని మలుపు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైల్వేకోడూరుమండలం అనంతరాజుపేట గ్రామానికి చెందిన అన్నమయ్య రవివర్మ(32) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి పరశురాంకు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.వీరు ఇరువులు సొంత పనుల మీద రాజంపేటకు వెల్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడు రవి వర్మ గత రెండు రోజుల క్రితమే కువైట్ నుండి ఇంటికివచ్చారని ఇంతలోనే ప్రమాదం జరగడంతో అనంతరాజుపేట గ్రామంలో విశాధఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికితరలించారు. ఈ విశయమై పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శివోహం ఆధ్వర్యంలో అన్నదానం



ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 03, ప్రభాతవార్త:

శివోహం అన్నప్రసాద సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అగస్త్యేశ్వరాలయంలో జూటూరు మధుసూధనరావుదంపతుల సౌజన్యంతో అన్నప్రసాద సేవ నిర్వహించారు. దాదాపు 500మంది ప్రజలు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాదసేవా సంఘం ప్రెసిడెంట్ శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు విజయకుమార్, నారాయణ, ఈశ్వర్‌రెడ్డి, లింగారెడ్డితదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



దువ్వూరు, జూన్ 03, ప్రభాతవార్త: మంగళవారం అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థుల ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నందున ఈ సంధర్భంగ గ్రామాలలోని నాయకులు, పార్టీ కార్యకర్తలునిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఇప్పటికే మండలంలోని 23గ్రామ పంచాయతీల్లో 144సెక్షన్‌తో పాటు 30 పోలీస్‌అమలు చేస్తున్నామన్నారు. ఈ చట్టాల ద్వారా ఎక్కడైన నలుగురికంటే ఎక్కువగా గుమికూడిన సమస్యలు సృష్టించిన చర్యలు ఉంటాయన్నారు. అలాగే దువ్వూరు, గుడిపాడు,చింతకుంట, కానగూడూరు గ్రామాలలో అన్ని దుకాణాలు మూసివేయాలని ఆదేశించామన్నారు. మంగళవారం ఉదయం 5గంటల నుండి రాత్రి 10గంటల వరకు ఈ నిబంధనలుఅమలులో ఉంటాయన్నారు. ఏ గ్రామంలోనైనా బాణాసంచా పేలిస్తే పేల్చినవారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి రౌడీషీట్ కూడ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వీటిని అమలు చేస్తున్నామని పోలీస్‌శాఖకు ప్రజలందరు సహకరించాలని కోరారు.

## 6,7 తేదీలలో బస్సు పాసులు, వికలాంగుల పాసులు ఇవ్వబడవు

పీలేరు, జూన్ 03 ప్రభాతవార్తః బస్సు పాసుల మాడ్యూల్ సర్వర్ అప్ గ్రేడ్ చేస్తున్న కారణంగా 6,7 తేదీలలో ఎలాంటి బస్సు పాసులు వికలాంగుల పాసులు , నెలవారి రాయితీ పాసులు

ఇవ్వబడువని డీఎం బండ్లకుమార్, 8వ తేదీ నుంచి యధావిధిగా అన్ని రకముల బస్సుపాసులు ఇవ్వబడును, కావున విద్యార్థులు , ఇతరులు సహకరించగలరని కోరారు.

## ఎన్నికల కౌంటింగ్ వేళ అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు, అర్బన్ ఇన్స్పెక్టర్ ఎపి.మస్తాన్,

మైదుకూరు జూన్ 3, ప్రభాతవార్త :



నేడు జరుగు సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సంధర్భంగా మైదుకూరు పట్టణ మరియు గ్రామాలలో 144సెక్షన్,30పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున పట్టణ మరియు గ్రామాలలోని ప్రజలు ఎవరు కూడా మైదుకూరు పట్టణంలోనికి రాకూడదని,మద్యం సేవించి ఒకరితో ఒకరు గొడవలు పడటం చేయరాదని అలాగే ర్యాలీలు,ఊరేగింపులు,బాణాసంచ కాల్చడం,డిజేలు పెట్టడం,డ్రమ్ములు కొట్టడం లాంటివి చేయరాదని అర్బన్ ఇన్స్పెక్టర్ ఎపి.మస్తాన్ హెచ్చరించారు.కాదని అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.పార్టీ ఆఫీసుల దగ్గర ఎవరు కూడా గుమికూడి ఉండరాదని,అట్లు కాదని ఉంటే వారి మీద చర్యలు తీసుకోబడతాయన్నారు.గెలిచిన పార్టీకి సంబందించిన వారు ఓడిపోయిన పార్టీ వారిని రెచ్చగొట్టడం,రెచ్చగొట్టే మాటలు అనడం మరియు కవ్వింపు చర్యలకు పాల్పడటం చేయరాదన్నారు.అలా చేసిన వారిమీద చట్టపరమైన చర్యలు తీసుకోని వారిమీద నాన్ బైలబుల్ కేసులు పెట్టడం జరుగుతుందన్నారు.

## చెరువులో పడి బాలుడు మృతి



బద్వేలు అర్బన్, జూన్ 3 ప్రభాతవార్త

: బద్వేలు పట్టణంలోని సిద్దవటం రోడ్డు సాయిబాబా గుడి పక్కన సాయినగర్‌లోనివాసం యుండే శ్రీనివాసులు , నాగలక్ష్మిలకు ఐదుమంది సంతానం కాగ వారిలో ముగ్గురు కుమార్తెలు, ఇద్దరుకుమారులు కలరు . సోమవారం సాయంత్రం చిన్నారులైన బీమా, శేషాద్రి అన్నదమ్ములతో పాటు మరికొంతమందికలిసి చేపలకోసం భాకరాపేట చెరువు వద్దకు వెళ్లారు. అయితే బీమా అనే బాలుడు చేపలకోసం వెళ్లి కాలుజారి చెరువులో పడ్డాడని, ఆ బాలుడిని సంరక్షించేందుకు పలు రకాలుగా ప్రయత్నం చేసి చివరకు పోలీసు, ఫైర్ సిబ్బంది సహాయం కోరగా అర్బన్ సీఐ యుగందర్‌తోపాటు అగ్నిమాపక సిబ్బంది పలువురు కొంతసేపు అక్కడ చెరువులో గాలింపుచర్యలు చేపట్టి బీమా మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సీమాంక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.బాలుడి మృతితో వారి కుటుంబంలో విషాధచాయలు అలుముకున్నాయి.

# పులివెందులలో పోలీసుల స్పెషల్ డ్రైవ్





పులివెందుల, జూన్ 3, ప్రభాతవార్త ః పులివెందుల పట్టణంలో సోమవారం అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ట్రిపుల్ రైడర్లు, వాహనాలు నడుపుతున్న మైనర్లను వాహనాలతో సహా పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని పేర్కొన్నారు. మైనర్లు పొరపాటున వాహనాన్ని ఢీకొట్టి ఏదైనా ప్రమాదాలు జరిగితే తగిన మూల్యం తల్లిదండ్రులు చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. అలాగే పరిమితికి మించి వాహనాలలో ప్రయాణించవద్దని తెఇలపారు. ద్విచక్రవాహనాలలో ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా మంగళవారం ఓట్ల లెక్కింపు ఉన్నందున పోలీసులు పులివెందుల పట్టణంలో నలుమూలల తనిఖీలు చేపట్టారు. అంతేకాకుండా ఆయా రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద కూడా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. కొత్తవారు ఎవరూ పట్టణంలోకి రాకూడదని, స్థానికులు మాత్రమే పట్టణంలో ఉండాలని పోలీసులు సూచించారు.

**- పులివెందుల రూరల్ :**

అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప ప్రజలు శనివారం బయటకు రావద్దని పులివెందుల సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, డాబాలు మూసివేయాలని చెప్పారు. పట్టణంలోకి ఆర్టీసీ బస్సులకు కూడా ప్రవేశం లేదన్నారు. కేవలం రింగ్‌రోడ్డులో మాత్రమే ప్రయాణిస్తాయని తెలిపారు. అన్ని మార్గాలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, స్థానికత గుర్తింపు కార్డులు ఉంటేనే పట్టణంలోకి అనుమతిస్తామని తెలిపారు.

**- వేంపల్లెలో ః**

వేంపల్లెలో మంగళవారం 144 సెక్షన్, పోలీసుయాక్టు 30 అమలులో ఉంటుందని సీఐ చాంద్‌బాషా తెలిపారు. పట్టణంలో, గ్రామాలలో గుంపులు గుంపులుగా ఉండకూడదని చెప్పారు. గ్రామాల నుండి ఎవరు కూడా పట్టణంలోని రాకూడదన్నారు. మద్యం సేవించి ఒకరితో ఒకరు గొడవలు పడటం చేయరాదని తెలిపారు. ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చడం లాంటివి చేయవద్దన్నారు. పార్టీ ఆఫీసుల దగ్గర ఎవరు గుమికూడి ఉండకూడదన్నారు. గెలిచిన పార్టీకి సంబంధించిన వారు ఓడిపోయిన పార్టీల వారిని రెచ్చగొట్టడం, కవ్వింపులకు పాల్పడడం చేయకూడదని చెప్పారు. అలా చేసిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

**- కొండాపురంలో ః**

కొండాపురం మండలంలో శనివారం 144సెక్షన్, పోలీసు 30యాక్టు అమలులో ఉన్నందున ఉదయం 5.00 నుండి రాత్రి 10.00గంటల వరకు ప్రజలు బయట గుమికూడి ఉండవద్దని సీఐ వేణుగోపాల్, ఎస్సై యోగేంద్రులు తెలిపారు. అన్ని దుకాణాలు మూసివేయాలని, ఎవరైనా ర్యాలీలు, ఊరేగింపులు చేయవద్దని తెలిపారు. బాణసంచా పేల్చితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## రైల్వే కోడూరులో కింగ్ ఎవరో

# నేడు తేలనున్న భవితవ్యం?

రైల్వే కోడూరు జూన్ 3 ప్రభాతవార్త...





రైల్వే కోడూరు నియోజకవర్గానికి కింగ్ ఎవరో మంగళవారం తేలనున్నది. గత 15 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా కొరముట్ల శ్రీనివాసులు ఉన్న విషయం విధితమే. అయితే ఈ నేపథ్యంలో ఇటీవల నూతన జనసేన అభ్యర్థిగా ఆరవ శ్రీధర్ ఎంపిక కావడం అందుకు మార్గదర్శకంగా ఆయనకు, తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి ఉండడం విశేషం. ముఖ్యంగా సర్వ హంగులతో ముక్కారూపానంద రెడ్డి జనసేన అభ్యర్థి కోసం, ఆయన కుటుంబ సభ్యులు పడిన శ్రమ అమోఘం. అయితే గత నెల 13వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎవరు విజేతలుగా నిలుస్తారని రైల్వేకోడూరు నియోజకవర్గం ఆశగా ఎదురుచూస్తుంది. ముఖ్యంగా ఇరు పార్టీలు మూకుమ్మడిగా ఎవరి ప్రయత్నాలు వారు చేసి గెలుపు దిశగా వారు వారు చేసిన ప్రయత్నాలు రేపటితో తేలనున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రైల్వే కోడూరు వైసిపి అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ఊహల్లో ఉన్నారని అయితే కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్ వైసీపీలో ఉన్న అసమ్మతి , అభివృద్ధికి నోచుకోని శాసనసభ్యుడుపై ఉన్న అసంతృప్తి తన గెలుపుకు డోకా లేదని అరవ శ్రీధర్ కూడా ధీమా వ్యక్తం చేస్తున్నాడు. ముఖ్యంగా ఐదు మండలాలలో అనతి కాలంలో తెలుగుదేశం పార్టీ లో ముక్కా రూపనంద రెడ్డి చేరి అంచెలంచెలుగా కూటమి అభ్యర్థిని తయారు చేసుకుని అటు అగ్రవర్ణాలను ఇటు దళితులను, బీసీలను ఐకమత్య రాగంతో ఏకత్రాటిపై తెచ్చుకుని, గెలుపే ధ్యేయంగా ముక్కా కుటుంబం విశ్వ ప్రయత్నాలను చేపట్టింది.రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలలో ప్రతి ఒక్క ఓటరు వారి వారి అభిష్టం మేరకు ఓట్లు వేశారని, అయితే ఇందులో కాపు సామాజిక వర్గం కసితో తమ నాయకుడు నిలబెట్టిన అభ్యర్థిని గెలిపించుకోవాలనే ఉద్దేశంతగెలిపించుకోవాలనే ఉద్దేశంతో నిరంతరం కాపు సంఘం నిరంతరం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు జనసేన అభ్యర్థి పై ముగ్గు చూపారు. అయితే ఉమ్మడి అభ్యర్థి అరవ శ్రీధర్ పై ప్రజలు ఏ విధంగా అభిమానం చెబుతారో లేక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై మొగ్గు చూపుతారో మంగళవారం జరుగుతున్న ఎన్నికల ఫలితాలలో రైల్వే కోడూరు కింగ్ ఎవరో తేలవలసి ఉంది.

# ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

### - 6 అసెంబ్లీ, ఒక లోక్ సభ స్థానానికి ఓట్ల లెక్కింపు- కౌంటింగ్‌కు అధికారుల విస్తృత ఏర్పాట్లు

రాయచోటి, జూన్ 3, ప్రభాతవార్త: రాయచోటి జిల్లా కేంద్రం శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 3 అంచల భద్రత మధ్య భారీ బందోబస్తు ప్రతి కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుళ్లు చొప్పున ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాలో 6 అసెంబ్లీ మరియు రాజంపేట పార్లమెంటు సెగ్మెంట్ల ఈవీఎం ఓట్ల లెక్కింపు నిమిత్తం ప్రతి ఓట్ల లెక్కింపు కేంద్రంలో 14 టేబుళ్లు చొప్పున మొత్తం 12 ఓట్ల లెక్కింపు కేంద్రాలలో 168 టేబుళ్లు ఏర్పాటు చేశారని జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఈవీఎం కౌంటింగ్ నందు ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్, ఏజెంట్లు ఉంటారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కొరకు ప్రతి టేబుల్‌కు 500 చొప్పున బ్యాలెట్ కేటాయిస్తారు. 24-రాజంపేట పార్లమెంటుకు సంబంధించి మొత్తం పోలైన పోస్టల్ బ్యాలెట్లు (పుంగనూరు అసెంబ్లీతో కలిపి) 21490. వీటి లెక్కింపు నిమిత్తం 20 టేబుళ్లు ఏర్పాటు, రెండు రౌండ్ల లెక్కింపు. అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ నిమిత్తం 1. 125 రాజంపేట అసెంబ్లీ - పోలైన పోస్టల్ బ్యాలెట్లు 3035, తంబళ్లపల్లె అసెంబ్లీ పోలైన పోస్టల్ బ్యాలెట్లు 2109, రాయచోటి అసెంబ్లీ పోలైన పోస్టల్ బ్యాలెట్లు 3534, పీలేరు పోస్టల్ బ్యాలెట్లు 4118, మదనపల్లి 3587. మంగళవారం ఉదయం 5 గంటలకు కౌంటింగ్ కకేంద్రంలో సిబ్బంది 3వ విడత ర్యాండమైజేషన్ చేయడం జరుగుతుంది. ఉదయం 6 గంటలకు స్ట్రాంగ్ రూంలను తెరుస్తారు. ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్, అటు తరువాత 8.30 గటలకు సాధారణ ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. మొదటగా తంబళ్లపల్లె ఫలితాలు, కోడూరు, మదనపల్లి ఫలితాలు కాస్త ఆలస్యంగా, ఆ తరువాత పీలేరు, రాయచోటి రాజంపేట ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు. కౌంటింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ తెలిపారు.

